క్లుప్తంగా

ఈ-క్లినిక్ ప్రారంభం



ఈ-క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: అవంతినగర్‌లో ఆనంద ఈ-క్లినిక్‌ను మూసాపేట కార్పొరేటర్ మహేందర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ-క్లినిక్‌లో చాలా తక్కువ ఫీజు వసూలు చేస్తూ వైద్య సేవలను అందిస్తారన్నారు. పేదలు నివసించే ప్రాంతాల్లో ఇలాంటి క్లినిక్ ఏర్పాటు చేయటం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లినిక్ యజమాని సురేష్‌కాచ్చటి, మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎం. సత్యంద్ర, దివాకర్, డా. ప్రవీణ్, నాయకులు ఎర్రస్వామి, నాగరాజు, రమేష్‌నాయర్, భాస్కర్, శ్రీకాంత్, మాణిక్, కృష్ణాముదిరాజ్ పాల్గొన్నారు.

రంజాన్ తోఫాల పంపిణీ



తోఫాలు అందజేస్తున్న కార్పొరేటర్ శిరీష బాబూరావు

మూసాపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ ఈద్ ముబారక్ తెలుపుతూ ముస్లింలకు రంజాన్ తోఫాలను అందజేస్తున్నారని బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఖాజా పటేల్, ఖాజాపాషా, ఫాయాజ్ పటేల్, ఎండీ గౌజ్, మౌలాన పటేల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సమ్మర్ క్యాంపు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా సమ్మర్ క్యాంపును ఏర్పాటు చేయనున్నారు. చిన్నచిన్న మట్టి కుండలు తయారు చేయడం, మదుబని పెయింటింగ్, చేరియాల్ పెయింటింగ్, నిర్మల్ , అక్రిలిక్, ట్రైబల్ పేయింటింగ్, పెన్సిల్ స్కెచ్, సంస్కృతం, భగవద్గీత శ్లోకాల నేర్పించడం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మే1 తేదీ నుండి 19వ తేదీ వరకు ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు తరగతులు నిర్వహించబడతాయి.ఆసక్తి గలవారు నామమాత్రపు రుసుముతో రిజిస్టర్ చేసుకోగలరు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్. 8886652030, 8886652004.

సిగ్నిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవ

సాక్షి, సిటీబ్యూరో: సిగ్నిటీ టెక్నాలజీస్ సహకారంతో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్మాణ్ వ్యవస్థాపకులు మయూర్ పట్నాల తెలిపారు. సిగ్నిటీ వేదికగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. నగరంతో పాటు సమీప జిల్లాల్లో విద్య, యువత ఉపాధి, మహిళా సాధికారిత, వైద్యం తదితర విభాగాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నిరుపేదల కోసం సిగ్నిటీ తమ సీఎస్ఆర్ నిధులతో నాంపల్లిలోని ప్రభుత్వ యం.యస్.జే క్యాన్సర్ ఆసుపత్రిలో మెడికల్ పరికరాలతో పాటు ప్రత్యేక గైనకాలజీ వార్డును ఏర్పాటు చేశారన్నారు. అంతేకాకుండా నల్గొండ జిల్లాలో మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారుల కోసం పిడియాట్రిక్ వార్డు ఏర్పాటు చేశారన్నారు.

మ్యూజికల్ అకాడమీ సమ్మర్ క్యాంప్

సాక్షి, సిటీబ్యూరో: సంగీతం నేర్చుకోవాలనుకునే ఔత్సాహికుల కోసం ప్రముఖ శిక్షణా సంస్థ మ్యూజిగల్ అకాడమీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తోంది. ఈ విషయం అకాడమీ వ్యవస్థాపకులు లక్ష్మీ నారాయణ యేలూరి తెలిపారు. వినూత్న శైలి శిక్షణ తరగతులకు రూపకల్పన చేశామన్నారు. ఆరు వారాల ఈ సంగీత శిక్షణ కార్యక్రమం జూన్ మొదటి వారం వరకూ కొనసాగుతుందన్నారు. పియానో, గిటార్, డ్రమ్స్, వోకల్స్... తదితర ప్రతి సబ్జెక్టునూ అనుభవజ్ఞులైన నిపుణులు బోధిస్తారని వివరించారు. కోర్సు పూర్తయిన తరువాత సర్టిఫికెట్, జామ్ సెషన్స్, గ్రూప్ యాక్టివిటీలు సైతం నిర్వహిస్తామన్నారు.

పీహెచ్‌డీ తరగతుల బహిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ తరగతులను రీసెర్చ్ స్కాలర్స్ బహిష్కరించారు. పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని బుధవారం పీహెచ్‌డీ విద్యార్థుల ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ క్లాసును బహిష్కరించి నినాదాలు చేస్తూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. పేద విద్యార్థులను పరిశోధన విద్యకు దూరం చేయాలని ఫెలోషిప్‌లు ఇవ్వకుండా, పీహెచ్‌డీ ఫీజులు పెంచారని ధ్వజమెత్తారు. ఫీజుల పెంపు విషయంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారులు జోక్యం చేసుకోవాలన్నారు.

ప్రజల వద్దకే అధికారులు, ప్రజాప్రతినిధులు



సంక్షేమ సంఘాల ముఖాముఖిలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

- స్థానిక సమస్యల పరిష్కారానికి వినూత్న కార్యక్రమం
- ప్రతిరోజు రెండు కాలనీ సంక్షేమ సంఘాలతో ముఖాముఖి
- సమస్యలు తెలిపి పరిష్కరించుకోవాలన్న కార్పొరేటర్



గంగపుత్ర సంఘం కాలనీలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులే ప్రజల ముంగిటకు వస్తున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ప్రజలకు సూచించారు. జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన నూతన పథకంలో భాగంగా కాలనీ సంక్షేమ సంఘాలతో ముఖాముఖి – సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని ఐదు విభాగాల అధికారులతో కలసి గంగపుత్ర సంఘం, ఫ్రెండ్స్ కాలనీలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు డివిజన్‌లో ఉన్న 90 కాలనీలలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. రోజు రెండు కాలనీలలో జలమండలి, జీహెచ్ఎంసీ, విద్యుత్, వైద్య ఆరోగ్యం, పోలీసు తదితర శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తామన్నారు. నేరుగా సమస్యలను తెలుసుకొని అప్పటికప్పుడు కొన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సమయం పట్టే సమస్యలను కాలనీ అసోసియేషన్‌కు తెలియజేస్తామని పేర్కొన్నారు.

శాఖల వారీగా ఫిర్యాదు చేయాలి

◆ ఈ సమావేశాల్లో ఈవ్ టీజింగ్, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి వంటి వాటిపై పోలీసులకు తెలపాలని సూచించారు.

◆ మంచినీటి సరఫరాలో లోపాలు, మ్యాన్‌హోళ్ల సమస్యలు వంటి వాటిని జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

◆ వీధి దీపాల సమస్యలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు విద్యుత్ శాఖ ఏఈకి, దోమల బెడద నివారణకు ఎంటామాలజీ అధికారికి తెలపాలన్నారు.

◆ రోడ్లు, పార్కులు, నూతన రోడ్ల నిర్మాణం వంటి వాటిపై జీహెచ్ఎంసీ ఏఈ దృష్టికి తీసుకొస్తే నోడల్ అధికారులు వీటిపై సమీక్షించి కాలనీ ప్రతినిధులతో చర్చించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తారని తెలిపారు.

◆ నేరుగా అధికారులకే సమస్యలను తెలిపి పరిష్కరించుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభిస్తుందన్నారు.

కాలనీల్లో అధికారులతో కలసి కార్పొరేటర్ పాదయాత్ర..

అధికారులతో కలసి డివిజన్‌లోని మొదటి రోజు గంగపుత్ర సంఘం, ఫ్రెండ్స్ కాలనీలలో పాదయాత్ర చేసి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, మ్యాన్‌హోల్స్‌లో మట్టిని తీసి అక్కడే వదిలేసి వెళ్తున్నారని ప్రజలు వారి దృష్టికి తెచ్చారు. గంజాయి ప్రభావం బాగా ఉందని అర్ధరాత్రి వరకు గంజాయి తాగుతున్న యువతను నివారించాలని కోరారు. లోవోల్టేజ్ సమస్య అధికంగా ఉందని చెప్పారు. ఈ సమస్యలపై అయా శాఖల అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏఎంహెచ్ఓ మమత, లింగస్వామి, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్, జలమండలి ఏఈ తేజ, విద్యుత్ ఏఈ అఖిల్, సబ్ ఇన్‌స్పెక్టర్ యుగేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, స్వామి, ప్రకాశ్, నాయకులు భిక్షపతి, లలితా, హరినాథ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణనగర్ కాలనీ అభివృద్ధికి సహకారం అందిస్తా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణనగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామకృష్ణనగర్‌కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా కార్పొరేటర్ దృష్టికి కానీ, నా దృష్టికి కానీ తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మధు, జనరల్ సెక్రటరీ యూసుఫ్, కోశాధికారి మధుసూదన్, కాలనీ వాసులు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు మాచర్ల భద్రయ్య, నరసింహ, రాధాబాయి, లక్ష్మి, రాజేశ్వరి, స్వామి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసిన రామకృష్ణనగర్ నూతన కార్యవర్గ సభ్యులు

మనూ 'ఐఎంసీ' పనితీరు భేష్

వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: మనూలో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) పనితీరు భేషుగ్గా ఉందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఐఎంసీ ద్వారా 'మనూ' నాలెడ్జ్ సిరీస్‌లో భాగంగా నిర్మించిన రెండు చిత్రాలు ఇంటర్ యూనివర్శిటీ కేంద్రమైన కన్సార్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్(సీఈసీ) నిర్వహించిన సీఈసీ యూజీసీ ఎడ్యుకేషనల్ వీడియో ఫెస్టివల్‌లో ఉత్తమ చిత్రాలుగా ప్రశంసలు అందుకున్నాయి. ఈ నేపథ్యంలో వైస్‌చాన్స్‌లర్‌ను ఆయన కార్యాలయంలో ఐఎంసీ అధికారులు కలిశారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ వారిని అభినందించారు. ఐఎంసీ రూపొందించిన చిత్రాలలో మొదటి చిత్రం 'అల్లహ్రావి'కు ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ విభాగంలో ఉత్తమ చలనచిత్ర అవార్డును అందుకుంది. అదేవిధంగా 'రెండవ చిత్రమైన 'పాలిమర్' ది ప్రామిస్ ఆఫ్ పీడీఎంఎస్' ఉత్తమ చిత్రం/డాక్యుమెంటరీ అవార్డు కేటగిరి కింద సైటేషన్‌కోసం సిఫార్సు చేయబడింది.



వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్‌ను కలిసిన ఐఎంసీ సెంటర్ ప్రతినిధులు

వైభవంగా నాగదేవత ఆలయ సప్తమ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



పూజలో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి చైతన్యనగర్, సుమిత్రానగర్‌లో కొలువైన శ్రీ నాగదేవత అమ్మవారి సప్తమ వార్షికోత్సవంలో బుధవారం కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి మంగళసూత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. ఈ ఉత్సవానికి ఆహ్వానించినందుకు ఆలయ కమిటీటి సభ్యులకు రాజేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్లు నరసయ్య, సీహెచ్. బాలరాజు, నరసింహాచారి, అనిల్‌కుమార్, సీహెచ్. మల్లేష్, నవీన్‌చారి, ఉమాపతి, ఎస్.యాదగిరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు..

ఆల్విన్‌కాలనీ: సుమిత్రనగర్ నాగదేవత ఆలయ సప్తమ వార్షికోత్సవంలో బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు నరసయ్య, బాలరాజు, నరసింహాచారి, అనిల్, మల్లేష్, నవీన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్ట్



రుచులను ఆస్వాదిస్తున్న కళాశాల చైర్మన్ గొట్టిముక్కల భాస్కరరావు, డైరెక్టర్లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో ఫుడ్ ఫెస్ట్–2023 బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించి దీని ద్వారా వచ్చిన ఆదాయాన్ని అనాథ శరణాలయాలకు విరాళంగా అందజేస్తున్నామని కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ గొట్టిముక్కల భాస్కరరావు, డైరెక్టర్లు ఈమధుసూదన్‌రావు, ఎస్. అరవింద్‌రావు, ప్రిన్సిపాల్స్ ఏ. పద్మప్రియ, ఎన్. చంద్రశేఖర్‌నాథ్‌లు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోంది

వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ఉద్యోగ నియమాకాలు చేపట్టకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌టీపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశానుసారం టీ–సేవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అభయ్ అగస్త్యకు ఉద్యోగ నోటిఫికేషన్‌లు జారీ చేయాలన్నారు. వైఎస్సార్‌టీపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో ఉద్యోగ ఖాళీలు ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వం వేలల్లో సైతం నోటిఫికేషన్లు వేయడం లేదన్నారు. దీంతో నిరుద్యోగులు వయస్సు మించిపోవడంతో తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. వైఎస్సార్‌టీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీ పోస్ట్‌లను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెపోగు విజయరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పావని, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల భాస్కర్ రెడ్డి , జిల్లా జనరల్ సెక్రటరీ కొండా అప్పారావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, కీసర మండల అధ్యక్షుడు ఉద్దెమర్రి సోమన్న, జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ జార్జ్, ఉప్పల్ మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు రుపేందర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భాషా తదితరులు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్ అగస్త్యకు వినతి పత్రం అందజేస్తున్న సురేష్‌రెడ్డి

కాంగ్రెస్ హయాంలోనే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

రంగారెడ్డినగర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద, బడుగు బలహీన ప్రజలకు న్యాయం జరిగిందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి చెన్నారెడ్డినగర్, పంచశీల కాలనీల్లో ఆయన పాదయాత్ర చేపట్టారు. ముందుగా ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముద్రించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు చేసిందేమీ లేదన్నారు. పథకాలను ఆర్భాటంగా ప్రారంభించడం, తదనంతరం గాలికొదిలేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టడం ఖాయమన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. క్రమంలో టీపీసీసీ జాయింట్ సెక్రటరీ సువ్వారి శ్రీనివాస్, ఎల్లయ్య కాక, ఐఎన్‌టీయూసీ నాయకుడు అమర్‌బాబు, మాజీ వార్డు సభ్యుడు శివకుమార్, హమ్మిరెడ్డి, రాజశేఖర్, ప్రవీణ్, రాహుల్, ప్రశాంత్‌రెడ్డి, కుమారి, లలిత, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

'ఎస్కీ' ఆధ్వర్యంలో ప్రత్యేక వెబినార్

రాయదుర్గం: పరిశ్రమ, అకడమిక్, స్టార్టప్, రీసెర్చ్ ఎకోసిస్టమ్‌తో కలిసి పనిచేయాలని నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీనియర్ రీజినల్ మేనేజర్ డాక్టర్ బికేసాహు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలజీ, ఎంప్లాయిబిలిటీ, ఐపీఆర్ అండ్ ఎంటర్‌ప్రెన్యూరల్ స్కిల్స్' అనే అంశంపై ప్రత్యేక వెబినార్‌ను ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధోసంపత్తి హక్కుల ప్రాముఖ్యత, ఎన్ఆర్‌డీసీ గురించి వివరించారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ ఇన్నోవేషన్ డైరెక్టర్ దీపన్‌సాహు మాట్లాడుతూ ఇన్నోవేషన్ ప్రెన్యూర్‌షిప్‌ను పెంపొందించడం అవసరమని భారత ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ సమావేశంలో నేషనల్ వెబినార్ చైర్మన్ డాక్టర్ రంగారెడ్డి, రాజస్థాన్ సెంటర్ చైర్మన్ గుంజన్ సక్సేనా, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ బ్రహ్మారెడ్డి, ఎస్కీ ఎఫ్‌డీపీ సెట్ నోడల్ ఆఫీసర్ పి సాయికిషోర్ ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, ఎస్కీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాదారుల అరెస్ట్

5.3 కేజీల గంజాయి స్వాధీనం

భాగ్యనగర్‌కాలనీ: కారులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 5.3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. బుధవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ చంద్రశేఖర్ వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా, గోదావరిఖని గౌతమ్‌నగర్‌కు చెందిన మేకల అభిలాష్, మంథనికి చెందిన లింగం శ్రీపాద్, అడ్డగుట్టపల్లికి చెందిన చెల్లా ధను, కాచుపల్లికి చెందిన నిమ్మల మణికంఠ చిన్ననాటి స్నేహితులు. వీరు కూకట్‌పల్లి, వివేక్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. పుట్టిన రోజు వేడుకల నిమిత్తం భద్రాచలం వెళ్లిన వీరు అక్కడి నుంచి సీలేరు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చారు. కూకట్‌పల్లి వై జంక్షన్ సమీపంలో వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు స్విఫ్ట్ డిజైర్ కారులో వస్తున్న వీరిని ఆపి కారును సోదా చేయగా డిక్కీలో 5.3 కేజీల గంజాయిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా నిందితుల్లో ఒకరైన అభిలాష్ గతంలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. ముగ్గురు స్నేహితులతో కలిసి గంజాయి విక్రయించి సొమ్ము చేసుకోవాలనే పథకం వేశాడు. ఈ క్రమంలోనే పోలీసులకు పట్టుబడ్డాడు. వారి నుంచి 5.3 కేజీల గంజాయి, స్విఫ్ట్ డిజైర్‌కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. అభిలాష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో కూకట్‌పల్లి సీఐ నర్సింగ్‌రావు, డీఐ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. బుధవారం కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనుల విషయమై జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిటీ శానిటేషన్ ప్లాన్ రూపకల్పన, యానిమల్ కేర్ సెంటర్, మోడ్రన్ ధోబీఘాట్, ఎఫ్ఎస్‌టీపీ, వైకుంఠధామం నిర్మాణం , 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొక్కలు నాటే కార్యక్రమాలపై చర్చించారు. అదే విధంగా దూలపల్లి పరిధిలోని తుమార్ చెరువు, ఊర చెరువుల్లో మట్టి పోసి కబ్జాకు యత్నిస్తున్న విషయాన్ని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి అభిషేక్ అగస్త్య మట్టిని తొలగించాల్సిందిగా దుండిగల్ తహసీల్దార్, ఇరిగేషన్ శాఖ డీఈలకు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, ఇంజినీరింగ్ శాఖ అధికారులు అడిషనల్ కలెక్టర్‌తో సమావేశమైన వారిలో ఉన్నారు.



అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో సమావేశమైన దుండిగల్ చైర్మన్, అధికారులు

నీటి కనెక్షన్ల చార్జీల పెంపుపై కాంగ్రెస్ ఆగ్రహం



నిజాంపేట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: ఇష్టానుసారంగా నీటి కనెక్షన్ల చార్జీలు పెంచడంతో సామాన్య ప్రజలకు భారంగా మారుతోందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో హాఫ్ ఇంచ్‌తో రెండు నీటి కనెక్షన్లు ఉన్న వారికి రూ.36,120, మూడు కనెక్షన్లు ఉన్న ఇళ్లకు రూ.53 వేలు చెల్లించాలని డిమాండ్ నోటీసులు అందడంతో ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. 2021లో నిజాంపేట్ కార్పొరేషన్ ఏర్పడిన తరువాత హాఫ్ ఇంచ్ కనెక్షన్‌కు రూ.180 వసూలు చేశారన్నారు. తదనంతరం జలమండలికి అప్పగించిన అధికారులు 12 నెలల అనంతరం క్యాన్ నంబర్లకు అత్యధిక మొత్తంలో రుసుం చెల్లించాలని పేర్కొనడం సమంజసం కాదన్నారు. నీటి కనెక్షన్ల బిల్లులను తగ్గించాలని లేకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, అరవింద్, రమేష్, అంజాద్, శ్రీశైలంయాదవ్, కొలన్ జీవన్‌రెడ్డి, వీరబాబు, మనీష్‌రెడ్డి, సురేష్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉంది'



శోభన థియేటర్ వద్ద డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవటం ఎంతో ఆనందంగా ఉందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం బాలానగర్ డివిజన్‌లోని శోభన థియేటర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాత సుదీప్ పటేల్, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్ గౌడ్, దళిత రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

దళిత సంక్షేమ నిధికి విరాళం...

కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి దళిత సంక్షేమ నిధికి తన వంతు సహాయంగా రూ.50వేల నగదు అందజేసినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, ప్రభాకర్, ఎస్‌కే శ్రీనివాస్, రామస్, శంకర్, మధు, మోహన్, నరేందర్, సతీష్, గజానంద్, శేఖర్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న గొట్టిముక్కల వెంగళరావు

తెలంగాణ దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

బాలానగర్: తెలంగాణ దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. కూకట్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయాద్ మిస్బా, ఎడ్ల ప్రభాకర్, బండారి ప్రవీణ్‌గౌడ్, బండారి మహేష్ గౌడ్, సమీ, శ్రీను, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.